# ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటిన
## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వర్ధన్నపేట, ఆగస్టు 6,(జర్నలిస్ట్ వార్త):
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 5 రోజుల స్వచ్ఛధనం, పచ్చధనం కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి మంగళవారం వర్ధన్నపేట మండల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, పాఠశాలలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి మొక్కలు నాటారు. ఈ నెల 9వ, తేదీ వరకు జరిగే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులచే స్వచ్ఛధనం, పచ్చధనం కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనార్థాలపై విద్యార్థులు ఉపన్యసించారు. మండల వ్యాప్తంగా స్వచ్ఛధనం, పచ్చదనం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులచేత వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయాలని కలెక్టర్ కోరారు. ప్లాస్టిక్ వాడకంతో వచ్చే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఇల్లంద గ్రామంలో నిర్వహించిన శ్రమదానంలో గ్రామస్తులతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, గ్రీనరీ పెంచే దిశగా మొక్కలు నాటి వాటిని పూర్తి స్థాయిలో సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈఓ రామిరెడ్డి, ఆర్ డబ్ల్యు ఎస్ ఈఈ వెంకట్రామ రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఇజ్జగిరి, ఎంపిడిఓ వెంకటరమణ ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, విద్యార్థునీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# అక్రిడిటేషన్ల జారీలో
## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**- అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి**
**- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్**




భూపాలపల్లి, ఆగస్టు 6,(జర్నలిస్ట్ వార్త): అన్ని పత్రికలతో సమానంగా చిన్న పత్రికలకు సైతం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని హైకోర్టు ధర్మాసనం తీర్పు నివ్వడాన్ని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్. జే.యూ ) స్వాగతించింది. మంగళవారం నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) ఎన్ యుజె(ఐ ) అనుబంధ టీఎస్ జెయు రాష్ట్ర నాయకులు పావుశెట్టి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి జల్దీ రమేష్ లు మాట్లాడుతూ టీఎస్ జెయు, టిజెఎ, టిజెజెఎసిల ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా అక్రిడిటేషన్ల జారీ కోసం ప్రభుత్వం జారీ చేసిన 239 ఉత్తర్వులలో లోపాలను ఎత్తిచూపుతూ జీవోను రద్దు చేయాలని కోరుతున్న విషయం విధితమే అన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులు జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా చిన్న పత్రికలలో పనిచేసే జిల్లా, నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు కార్డులు) ఇవ్వకుండా దూరం పెట్టడం చెల్లదని హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2016 లోని షెడ్యూల్ ఈ ను హైకోర్టు కొట్టి వేయటం అభినందనీయమన్నారు. చిన్న పత్రికలను నాలుగు విభాగాలుగా విభజించడం చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. చిన్న పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులను ఏ,బి,సి,డి కేటగిరీలుగా విభజించడం సరైనది కాదని కోర్టు అభిప్రాయపడినట్లు వారు తెలిపారు. ఈ మేరకు హైకోర్టు ధర్మసనానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆచార్య జయశంకర్ చిరస్మరణీయులు
## - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి






వరంగల్ బ్యూరో, ఆగస్టు 6,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని మేలుకొలిపిన మహనీయుడు, స్ఫూర్తిదాయకమైన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త ప్రొ: జయశంకర్ 91వ, జయంతి పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ విద్యార్థులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వరాష్ట సాధన కోసం నిరంతరం పరితపించిన మహనీయులు, మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని 6 దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం జయశంకర్ సార్ చేసిన కృషి, త్యాగాన్ని తెలంగాణ ప్రజలు సదా స్మరించుకుంటారని, రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారిక నిర్వహిస్తున్నదని అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ నెల 9వ, తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛధనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములై, చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ కోరారు. విద్యార్థులు జన్మదినం జ్ఞాపకంగా వారి నామకరణంతో మొక్కను నాటినచో మొక్క ఎదుగుతున్న కొద్దీ, విద్యార్థులు గొప్ప ఆలోచనలతో ఎదుగుతారని అన్నారు.

### ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం

ప్లాస్టిక్ ఉపయోగం వలన భూసారం యొక్క ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని కలెక్టర్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా పేపర్, జ్యూట్ సంచులు వాడేలా ప్రజల్లో చైతన్యం కల్గించాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల భావితరాల భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులపై ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, పర్యవేక్షకులు రమేష్, చంద్రశేఖర్, మంజుల, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్
## జయంతి వేడుకలు




రాయపర్తి, ఆగస్టు 6(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. టిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎండీ నయీమ్ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, జిల్లా పార్టీ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ రైతు బంద్ అధ్యక్షులు ఆకుల సురేందర్ రావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాయపర్తి మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మండల పార్టీ సహాయ కార్యదర్శి ఘౌడిశెట్టి రామారావు, సోషల్ మీడియా అధ్యక్షులు ఆశ్రఫ్ పాషా, రాయపర్తి గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తి భవాని క్లినిక్ సీజ్

**- నకిలీ డాక్టర్ పై చర్యలు తీసుకుంటాం - డిప్యూటీ డిఎం హెచ్ఓ గోపాల్ రావు**





**రాయపర్తి, ఆగస్టు 6,(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని భవాని క్లినిక్ వరంగల్ జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ గోపాల్ రావు సీజ్ చేశారు. మంగళవారం పత్రికల్లో ప్రచురితమైన వార్త కథనాలకు అనుగుణంగా ఆయన రాయపర్తి మండల కేంద్రంలోని సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్ వైద్య విధానాన్ని పరిశీలించారు. క్లినిక్ పేరుతో అడ్డగోలు వైద్య నిర్వహణ కొనసాగిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడం నేరమని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న భవాని క్లినిక్ సీజ్ చేయడంతో పాటు ఆర్ఎంపీ డాక్టర్ జెర్రిపోతుల కృష్ణపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కనీస వసతులు, అర్హతలు, అనుమతులు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్ పెట్టుకుని, అందులోనే మెడికల్ షాపులు నిర్వహిస్తూ అమాయక ప్రజల వద్ద అధికంగా డబ్బులు లాగేస్తూ, బాధితులను నిలువు దోపిడీ చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. అనుమతులు లేని నిర్వహణతో ప్రజల వద్ద డబ్బులు కాజేస్తూ, వారి ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని హెచ్చరించారు.

### అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి

పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. అందులో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు అనుభవం కలిగిన వారు వైద్య సేవలు అందిస్తున్నారు. ఎలాంటి ఫీజులతో సంబంధం లేకుండా ఉచిత వైద్య సేవలు అందిస్తుంటే, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎలాంటి అనుమతులు లేని క్లినికుల వద్దకు వెళ్లి ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కోవద్దన్నారు. గత కొద్ది రోజుల క్రితం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఓ యువకుడు నీరసంగా ఉందని పక్కనే ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళితే, అనుభవం లేని వైద్య సేవలు అందించడంతో ఆ యువకుడు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి చోటుచేసుకుందన్నారు. ఇప్పటికైనా ఉచిత ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకునే విధంగా ప్రజలు ఆలోచించాలని సూచించారు.

### అపరిశుభ్రత వల్లే అనారోగ్య సమస్యలు

ప్రస్తుతం ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతూ అందుబాటులో ఉన్న వైద్య సేవలు వైపు పరిగెత్తుతున్నారు. ముందస్తుగా అనారోగ్య సమస్యలు అనేవి కేవలం అపరిశుభ్రత కారణం వల్లే వ్యాపిస్తాయని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అనారోగ్య సమస్యలు కుదుటపడతాయని వివరించారు. ముందస్తుగా పట్టణాలు, పల్లెలు ఏ ప్రాంతాలకు చెందిన వారైనా సరే, పరిశుభ్రత చర్యలను పాటించడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులలోని ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖ ఆర్ఐ చంద్రమోహన్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది మధ్యస్ రెడ్డి, శ్యామ్ సుందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి
## - జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి



రాయపర్తి, ఆగస్టు 6,(జర్నలిస్ట్ వార్త): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో స్వచ్ఛధనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను ఆకస్మిక తనిఖీ చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వచ్ఛధనం, పచ్చదనం కార్యక్రమంలో భాగమైన అంశాలను పాటించాలన్నారు. ప్రధానంగా పరిశుభ్రత చర్యలను పాటించాలన్నారు. ప్రజలకు త్రాగునీరు, పారిశుధ్య, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత చూసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. స్వచ్ఛతను, పచ్చదనం కార్యక్రమంలో విద్యార్థుల పాత్ర అనేదానిపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.కిషన్ మండల పంచాయితీ అధికారి కూచన ప్రకాష్, ఏంఈవో రంగయ్య, స్థానిక పంచాయితీ కార్యదర్శి అస్మా, గ్రామ పంచాయితీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

